# 4. అభివృద్ధి నిరోధ "కణ్"

"ఉ( ; ఏమిటి, విశేషాలు? ఉత్తరం రాసేవొచ్చావనుకో. ఐనా హటాత్తుగా ఒచ్చినట్టే లెఖ్క. ఎందుకంటే ఈ ఉత్తరంలో నువ్వు ఏపనిమీద వొస్తున్నావో ఆమాటలేదు." అని వినాయక రావుని పలకరించేను.

"సరే గాని; నువ్వు వెంటనే బయల్దేరే మార్గం చూడు. మనం అర్జంటుగా భీమారావుని కలవాలి..... అదే; మా రెండో తమ్ముడి గొడవ. వాడు ఎస్. అండ్. బి. రావు కంపెనీలో ఉద్యోగం కోసం అప్లయి చేసేడు కదా. తీరా ఏమిటా కంపెనీ. ఎవరా ఎస్ ఎండ్ బి. రావులు అని భోగట్టా చేస్తే అది సుబ్బారావు అండ్ భీమారావు కంపెనీ అని, భీమారావు అంటే కాంట్రాక్టుల కోసం ఒకప్పుడు మీ ఆఫీసుచుట్టూ తిరుగుతూ వుండిన పొణుగుపాటి భీమారావే అనీ తెలిసింది."

"ఐతే?"

"సుబ్బారావూ భీమారావూ ఆ కంపెనీకి మేనేజింగు పార్ట్‌నర్స్‌ట. ఇదేమో వాళ్ళ ఆఫీసులో ఎకౌంట్సులో డిప్యూటీ మేనేజరు ఉద్యోగం మావాడు బీ.కాం., పాసై అదేదో ఎకౌంట్సుకోర్సు కూడా ఏడిశాడు కదా. ఎలాగో ఓలాగ మాతమ్ముణ్ణి ఇందులో వేయించావంటే నా నెత్తిమీంచి పెద్ద బరువుదింపిన వాడివవుతావు."

'ఉద్యోగాలిప్పించడం, పెళ్ళి సంబంధాలు చూడ్డం - ఇలాటి వాట్లో నన్ను అంతగా నమ్మడానికి వీల్లేదు. ఐనా ప్రయత్నిద్దాంలే. రేపు ఉదయం వెళ్ళికలుద్దాం, తొందరెందుకు;' అని చొక్కా విప్పుకోబోతూ వుండగానే వినాయక రావు నన్ను ఆపేడు. "మనం వెంటనే వెళ్దాం. భీమారావు ఇంకోగంట వరకు ఆఫీసులో ఉంటాడుట. ఆ తరవాత ఎక్కడికెళ్తాడో ఎప్పుడు ఇంటికి చేరుతాడో తెలీదుట. రేపు ఉదయం ఆఫీసు కెప్పుడొస్తాడో తెలీదుట. ఇందాక రైలుదిగిన వెంటనే వాళ్ల ఆఫీసుకి ఫోన్ చేస్తే చెప్పేరు."

ఎస్ ఎండ్ బి రావూస్ ఆఫీసుకి మేం వెళ్లేసరికి ఐదున్నర కాలేదు. ఇంకా గంటసేపు ఉంటాడనుకున్న భీమారావు పావుగంట కిందటే వెళిపోయాడని తెలిసింది. "ఆయన్తో ఏం పనండి? పెద్దయ్యగారున్నారుగా; సూసేండి." అన్నాడు మాకు సమాచారం చెప్పిన ప్యూన్.

'ఎవర్రా పోలిపిల్లీ, వాళ్లు? లోపలికి పంపించకుండా నువ్వే వ్యవహారాలు చక్కబెట్టేస్తున్నావా?' అని కేక వినిపించింది.

దాంతో మాకు పరిస్థితి ఇరకాటం అయిపోయి; తప్పనిసరిగా లోపలికి వెళ్లవలసి వచ్చింది.

లోగడ ఆగది ఏ సీ చేసి ఉండేది. టాప్ ఎగ్జిక్యూటివులు కూర్చునే స్టఫ్డ్ రివాల్వింగ్ చేర్‌లో భీమారావు కూర్చుని ఉండేవాడు. ఇప్పుడు ఏసీలేని గదిలో బీసీ నాటిదా అనిపించే ఒక కుర్చీలో ఆనాటి మనిషే కాబోలనిపించే ఒకాయన కూర్చుని ఉన్నారు.

"నమస్కారం" అంటూనే నేనాయన్ని గుర్తు పట్టేను." ఎవరో అనుకున్నాను, సార్! తమరేనా? నేను ఇరవై ఏళ్లకిందట విజయనగరంలో మీ దగ్గిర పనిచేసేను సార్." అని నాపేరూ ఆ వివరాలూ

చెప్పేను. వినాయకరావుని కూడా పరిచయంచేసేను. "బావున్నారా, సార్! పన్నెండేళ్లకిందట మీరు రిటైరయినప్పుడు వీడ్కోలు సభలో చూడ్డమే. ఆ తర్వాత తమర్ని చూడ్డం అవలేదు." అన్నాను.

సుబ్బారావు గారు కష్టపడి పనిసేసి నిజాయితీ గా వ్యవహరించిన ఆఫీసర్‌గా పేరు పొందారు. తాబేదార్లందరూ చెప్పి చెప్పకా సాయంకాలం అయిదూ అయిదున్నరకి జారుకున్నా; ఫ్యాను కూడా ఏదో సాకు పెట్టి ఆరుగంటల్లోగా దాటేసినా, ఆయన ఒక్కరూ కూర్చుని ఫైల్సన్నీ క్షుణ్ణంగా పరిశీలించి మర్నాటికి ఏవీ పెండింగులో ఉంచకుండా ఆర్డర్సు వేసి మరీ ఇంటికి వేళ్లే వారు. ఒక ఫైలుకి సంబంధించిన సందేహం ఇంకో ఫైల్ చూస్తే తప్పా తెలియదని అనిపించినప్పుడు వేళకి ఫ్యూన్ గాని ఆ గుమస్తాగాని లేకపోతే ఆయన హాల్లో కొచ్చి, తనకి కావలసిన ఫైలు వెతుక్కుని సందేహం తీర్చుకునే వారు. ఆయన రిటైరయినప్పుడు పెట్టిన వీడ్కోలు సభలో మా డిపార్టుమెంటు జాయింట్ డైరక్టరు గారు మాట్లాడుతూ "సుబ్బారావుగారు కష్టజీవిగా పైకొచ్చేరు. ఇంక ఆయన రెస్టుజీవిగా కొనసాగాలని కోరుకుంటున్నాను" అన్నారు.

లోపలినుంచి ఒకాయన వచ్చేరు. "మూడు కాపీలు టైపుచేసేను గానీ, సార్ మూడోది స్పష్టంగా రాలేదండి. అందుకని ఒక జెరాక్సు కాపీ పెట్టేను" అని సుబ్బారావు గారికి అందించి పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు.

"మా స్టెనో గవర్రాజుగారు. గవర్నమెంట్‌లో ముప్ఫయ్యారేళ్లు పనిచేసి, ఆ తరవాత ఎనిమిదేళ్లు ఒక షిప్పింగ్ కంపెనీలో చేసేరు. మొన్న ఏప్రిల్‌నుంచీ ఇక్కడ చేస్తున్నారు" అని మమ్మల్ని కూడా ఆయనకి పరిచయం చేసేరు సుబ్బారావు గారు.

"అంటే, దగ్గిర దగ్గిర డబ్భయ్యేళ్లంటాయన్న మాట. బాప్‌రే ! భలే ఏక్టివ్‌గా ఉన్నారే... మా లాంటి వాళ్లం మీ వయస్సొచ్చే సరికి ఒకచేతిలో సుందరకాండా ఒకచేతిలో చేతి కర్రా పట్టుకుని ఈజీచేర్ లైవ్స్‌లో పడిపోతాం" అన్నాడు వినాయకరావు.

"ఏం కాదు. అదంతా పూర్వకాలం ముచ్చట. నేను చూడరాదూ? నాకు మొన్న ఫిబ్రవరికి 70 ఏళ్ళు వెళ్లేయి. రెండు దంతాలు ఊడేయన్నమాట గానీ మిగతా యంత్రం అంతా గట్టిగానే ఉంది. నేను చేసినంత పని నేను చేసినంత తొందరగా మా అల్లుడు చెయ్యనే లేడు. అంచేతనే మా అల్లుణ్ణి ఛీఫ్ ఎగ్జిక్యూటివుగా వుంచి నేనే మేనేజింగు డైరక్టరుగా ఉంటున్నాను, ఈ కంపెనీకి" అన్నారు సుబ్బారావు గారు.

"భీమారావు ఈయన అల్లుడన్నమాట... అయితే పరవాలేదు" అని సైగలు చేసుకున్నాం. సుబ్బారావుగారు ఆ కాగితాలు పరీక్షగా చూసి సంతకాలు పెట్టేలోగా.

"ఏమిటి, పని మీదొచ్చేరా? అని అడిగారు సుబ్బారావుగారు.

"మా పనికి మీ అంతటి వారు జోక్యం చేసుకోనక్కర్లేదేమో, ఏదో భీమారావు లెవెల్లో అయిపోతుందని, అతన్ని కలుద్దామని వొచ్చేం. దేముడే వరమివ్వడానికొచ్చినట్టు అనుకోకుండా మీ దర్శనం అయింది." అని వివరాలు చెప్పేను.

"గవర్రాజుగారూ, ఆ ఫైలు వెతికి పట్రండి, అని పంపించీ కూడా; "ఆ అబ్బాయిపేరు లక్ష్మణ రావన్నారు కదూ. సెలక్ట్ చెయ్యలేదనుకుంటాను. మేం ఈ మధ్య ఒక పాలసీ డెసిషన్ తీసుకున్నాం, ముఖ్యమైన పోస్టుల్లో వయో వృద్ధుల్నే వెయ్యాలని; నాకు తెలిసిన ఒక పెద్ద వ్యాపారవేత్త తన కంపెనీలో అందరూ ముప్ఫయ్యేళ్ల లోపువాళ్లే ఉండాలని నిర్ణయం తీసుకున్నట్టు. అతనికి

యంగ్ మెన్ (అండ్ విమెన్) మీద గట్టి నమ్మకం. నాకు వయోవృద్ధులంటే కొంచెం అభిమానం.'

గవర్రాజుగారు ఫైల్ తెచ్చేరు. "లక్ష్మణరావనే అతన్ని సెలక్ట్ చెయ్యలేదండి."

"అంటే, వయోవృద్ధులు కానివాళ్ల పనిచెయ్యలేరంటారా?" అన్నాడు వినాయకరావు.

"ద అదర్ వే రౌండ్." అన్నారు సుబ్బారావుగారు. "వయోవృద్ధులు పనిచెయ్యగలరని ఆలోచన. పూర్వం వైద్య సదుపాయాలు సరిగా లేక, గరిష్ఠ ఆయుఃప్రమాణం తక్కువగా ఉండిన రోజుల్లో 55 ఏళ్ల వయస్సొస్తే ముసలి వాళ్లయిపోయేవారు కాబోలు. ఇప్పుడు అలా కాదేమో అనిపిస్తోంది. కోట్లాది మంది జనం తాలూకు ప్రస్తుతం, భవిష్యత్తు- వీటిమీద కీలకమైన నిర్ణయాలు తీసుకునే రాజకీయ నాయకుల్లో ఎక్కువమంది 70 ఏళ్లు దాటిన వాళ్లే ఉంటున్నారు. శాస్త్రంలో కళలో ఎంత ఎక్కువ వయసైతే అంత రాణ. పత్రికా సంపాదకుల మాట ఏమోగాని పండితుల్లోనూ సాహిత్యానికి సంబంధించిన అవార్డు గ్రహీతల్లోనూ ఎక్కువ మంది వయోవృద్ధులే. వయోవృద్ధులకి అనుభవం నేపథ్యంగా ఆలోచనకి పదునొస్తుందేమో అని నా అనుమానం. అంతెందుకు? మాది వ్యాపార సంస్థ కదా. దక్షిణం, ఉత్తరం అనే వివక్ష లేకుండా టాప్ ఇండస్ట్రీస్ అన్నిట్లోనూ కీలకమైన నిర్ణయాలు తీసుకునేది వృద్ధులే గాని యువకులు కాదు అంచేత "ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులారా, చావండి! " అనే స్లోగన్ని కొద్దిగా మార్చాలేమో."

సుబ్బారావు గారి ఆవేశానికి గవర్రాజుగారు చిన్న ఆనకట్ట వేసినట్టయింది. "అంత మరీ కాదు గానండి. అయ్యగారి ఉద్దేశమేంటంటేనండి. ఇప్పుడు భీమారావుగారున్నారాండి. వారు బైట పన్లు సమర్థంగా చేస్తారండి. వారాల తరబడి తిరగ్గలరండి. మరి అయ్యగారు అలా కాదుగదండి. అయితేనండి. అయ్యగారికి అన్నం, పానం, పడకా - యిన్నిట్లో కూడా ఎంత అవసరమైతే అంతేగాని విలాసాలకి తావులేదండి. అంచేతండి. పెద్ద వాళ్లయిపోయారు గదాని ఎవర్నీ మూలకూర్చో పెట్టేక్కర్లేదండి. పనిచేస్తే వ్యక్తికీ లాభం, దేశానికీ లాభమే నండి."

*

*("ఆంధ్రభూమి" డెయిలీ : 24-6-92)*

With the best Compliments from

West Godavari District

**PETROL & HSD DEALERS ASSOCIATION**

ELURU - 534 001

**President**

**T.A. SURYANARAYANA REDDY,**

B.SC., D.F.T.(S.R. & S.E.)

**Secretary**

**BHIMARAJU SURYANARAYANA**